క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

రూ.1.17 లక్షలతో విద్యుత్ సరఫరా పనులు



టి.నగరపాలెంలో కొత్తగా విద్యుత్ స్తంభాలు వేస్తున్న సిబ్బంది

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెంలో రూ.1.17 లక్షలతో విద్యుత్ సరఫరా పనులు సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఏళ్ల తరబడి పంచాయతీలో వ్యవసాయ భూములు, వీధుల మధ్య, ఇళ్ల మీద నుంచి వేలాడుతూ వెళ్లే వైర్లు, స్తంభాలను సిబ్బందితో సరి చేయించారు. అవసరమైన చోట కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ పనులను సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు పూసర్ల రామారావు, పల్లా పోతురాజు తదితరులు పర్యవేక్షించారు.

హరిజన సంతపేటలో వీధిలైట్ల పునరుద్ధరణ



సంతపేట కొత్తమ్మతల్లి ఆలయ రహదారిలో వెలుగుతున్న వీధిదీపాలు

తగరపువలస: జీవీఎంసీ 1, 2 వార్డుల్లో వీధి దీపాల పునరుద్ధరణ పనులు మూడు రోజులుగా జరుగుతున్నాయి. 'వీధి దీపాలు వెలగక అంధకారం' శీర్షికతో ఈ నెల 2న సాక్షిలో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ నెల 3న భీమిలి రోడ్డులో శని, ఆదివారాల్లో సంతపేట కొత్తమ్మతల్లి ఆలయ రహదారిలో పనులు పూర్తి చేశారు. హై ఓల్టేజీ కారణంగా వివిధ ప్రాంతాల్లో వీధి దీపాలు కాలిపోగా వాటిని పునరుద్ధరించారు.

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

పీఎం పాలెం: నేర ప్రవృత్తిని విడనాడి బుద్ధిగా జీవించాలని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ రౌడీషీటర్లకు సూచించారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లపై పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందన్న విషయం మరిచిపోరాదన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సమాజానికి చేటు కలిగించే సంఘటనలు మీ దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయి సరఫరాదారులు, వినియోగదారుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సమావేశంలో 33 మంది రౌడీషీటర్లు, ఆరుగురు పాత గంజాయి నేరస్తులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు.

పైప్‌లైన్ పగుళ్లకు లామినేటెడ్ పనులు



చిట్టివలస శివాలయం వద్ద పైప్‌లైన్ పగుళ్లకు లామినేటెడ్ పనులు చేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

తగరపువలస: భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేట పంప్‌హౌస్ సమీపంలో చిట్టివలస శివాలయం ముందు తాగునీటి పైప్‌లైన్‌కు ఏర్పడిన పగుళ్లకు సంబంధించి లామినేటెడ్ పనులు మూడు రోజులుగా జరుగుతున్నాయి. గతంలో పంప్‌హౌస్ నుంచి భీమిలి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి వినియోగించిన గ్లాస్ రీయిన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ పైప్‌లైన్ చుట్టూ ఇసుక వేయకపోవడంతో నీటి సరఫరా సమయంలో వైబ్రేషన్‌కు రాళ్లు తగిలి పైప్‌లకు తరచూ పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఇలా ఈ ఒక్క ప్రదేశంలోనే కాకుండా తగరపువలస నుంచి భీమిలి మధ్యలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్, గణేష్ థియేటర్ కూడలి, మరడపాలెం, చిల్లపేట, బ్యాంకు కాలనీ, కీతిన్‌పేట తదితర ఎనిమిది ప్రదేశాల్లో తరచూ ఇదే సమస్య తలెత్తుతోంది. దీంతో పైప్‌లైన్‌కు పగుళ్లు ఏర్పడి తరచూ తాగునీటి సరఫరాకు అంతరాయం కలగడంతోపాటు వేలాది లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది. పగిలిన చోటే మళ్లీ మళ్లీ పగులుతుండడంతో గోతులు పూడ్చకుండా వదిలిపెడుతున్నారు. పైప్‌లైన్ పగిలిన ప్రతీసారీ ఆయా ప్రదేశాలు చెరువులుగా మారుతున్నాయి. ప్రస్తుతం శివాలయం ముందు నుంచి సీసీ రోడ్డు నిర్మిస్తున్నందున పైప్‌లైన్‌కు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఈ మరమ్మతులు పూర్తయితే దీనిపై నుంచి సీసీరోడ్డు నిర్మాణం పూర్తికానుంది.

ప్రైవేటు భవనంలోకి ఎస్సీ కళాశాల వసతి గృహం



ప్రస్తుతం శిథిలమైన హాస్టల్ భవనం

భీమునిపట్నం: భీమిలిలోని ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌ను మరో భవనంలోకి త్వరలో తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆదివారం విశాఖ ఎస్సీ సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి టి.సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ డైట్ సమీపంలో ఉన్న వసతి గృహం పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. ఇందులో 70 మంది విద్యార్థులు ఉన్నారని, వారు ఈ హాస్టల్‌లో ఉండడానికి వీలులేని పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అందువల్ల త్వరలోనే గొల్లలపాలెం సమీంలోని ఒక ప్రైవేటు భవనంలోకి హాస్టల్‌ను తరలించనున్నామని, ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

తీరనున్న పార్కింగ్ కష్టాలు



పనులు పర్యవేక్షిస్తున్న ఏఈవో జగన్‌మోహనాచార్యులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కొండపై భక్తులకు పార్కింగ్ కష్టాలు తీరనున్నాయి. శనివారం, ఆదివారం, ప్రముఖ పర్వదినాలు, ఇతర సెలవు రోజుల్లో శ్రీవారిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో వందలాది వాహనాలు కొండపైకి చేరుకుని పార్కింగ్ చేసుకునేందుకు నానావస్థలు పడేవారు. అయితే ఈ సమస్యను పరిష్కరించే దిశగా టీటీడీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆలయ వెనుక భాగాన ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేయించి పార్కింగ్‌కు సరిపోయేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా ఆదివారం ఆ పనులను ఆలయ ఏఈవో జగన్‌మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ ప్రారంభించారు. సుమారు వంద కార్లు, బైకులు పార్కింగ్‌కు సరిపడేలా ఏర్పాటు చేస్తున్నట్లు వీరు తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

- ఘనంగా స్వర్ణపుష్పార్చన
- కనుల పండువగా నిత్య కల్యాణం



నిత్య కల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు, అధికారులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం వైభవంగా ఆర్జితసేవలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆశీనులను చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించి, ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు చక్రపాణి తదితరులు ఈ పూజ నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి ఘనంగా నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వైభవంగా గరుడసేవ..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించి విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు పూజ నిర్వహించారు.

ప్రహరీ కూల్చేశారు... కట్టడం మరిచారు

గండిగుండం ఉన్నత పాఠశాలకు భద్రత కరవు



ఆరు లైన్ల రహదారికి ఆనుకుని ఉన్న గండిగుండం ఉన్నత పాఠశాల

ఆనందపురం : రోడ్డు విస్తరణలో భాగంగా ఉన్నత పాఠశాల ప్రహరీని కూల్చి వేశారు. అలా కూల్చివేసి ఐదేళ్లు కావస్తున్నా కొత్తగా ప్రహరీ నిర్మించకపోవడంతో పాఠశాలకు భద్రత లేకుండా పోయింది. దీంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. అనకాపల్లి – ఆనందపురం జాతీయ రహదారిని అనుకొని గండిగుండం ఉన్నత పాఠశాల ఉంది. కాగా ఐదేళ్ల క్రితం ఆ రోడ్డుని ఆరు లైన్లు రహదారిగా అభివృద్ధి చేసిన సమయంలో గండిగుండం ఉన్నత పాఠశాల ప్రహరీని తొలగించారు. అయితే రహదారి నిర్మాణం కోసం స్థలాలను సేకరించినప్పుడు కట్టడాలు తొలగించాల్సి వస్తే స్థలంతో పాటు తొలగించిన వాటిని తిరిగి నిర్మించుకోవడానికి పరిహారం కూడా అందించాలి. కానీ ఇక్కడ మాత్రం అధికారులు ఆ నిబంధనలు ఏవీ పట్టించుకోలేదు. ఐదేళ్లు అయినా ఇంత వరకూ ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. దీంతో ఆరు లైన్ల రహదారికి ఆనుకొని ఉన్న హైస్కూల్‌కు ప్రహరీ లేకపోవడంతో తరగతులు నిర్వహిస్తున్న సమయంలోనే పాఠశాల ప్రాంగణంలో పశువులు సంచరిస్తున్నాయి. అలాగే గ్రామస్తులు విచ్చలవిడిగా రాకపోకలు సాగిస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతింటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రాంగణం విశాలంగా ఉండడంతో రాత్రి వేళ ఆ మార్గంలో ప్రయాణించే లారీ సిబ్బంది తదితరులు వాహనాలను నిలుపుదల చేసి అక్కడే బస చేసే పరిస్థితి నెలకొంది. దీంతో పాఠశాలకు రక్షణ లేకుండాపోయింది. ఈ విషయమై స్థానిక సర్పంచ్ గంప్రెడ్డి శ్రీనువాస్ మాట్లాడుతూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రాంగణంలో ఉన్న మొక్కలు పాడైపోయాయని చెప్పారు. దీనిపై జాతీయ రహదారుల సంస్థను సంప్రదించగా నష్ట పరిహారం జిల్లా పరిషత్‌కు అందిస్తామని చెబుతున్నారని... కానీ ఇంతవరకూ చర్యలు తీసుకోలేదని చెప్పారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

4వ వార్డులో ముమ్మరంగా ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

కొమ్మాది: డెంగ్యూ, మలేరియా కట్టడికి చేపడుతున్న చర్యల్లో భాగంగా జీవీఎంసీ 4వ వార్డులో మలేరియా నివారణ విభాగం ఆధ్వర్యంలో ఫాగింగ్ ప్రక్రియ చేపట్టారు. ఉప్పాడ, మంగమారిపేట, రామాద్రి కాలనీ ప్రాంతాల్లో జీవీఎంసీ మలేరియా ఇన్‌స్పెక్టర్ సూరిబాబు పర్యవేక్షణలో మెగా ఫాగింగ్ నిర్వహించారు. దోమల వ్యాప్తి తగ్గించడానికి సాయంత్రం వేళల్లో చేస్తున్న ఫాగింగ్ ఉపయోగపడుతుందని, ప్రతి ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మణిపూర్ హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

భీమునిపట్నం: మణిపూర్‌లో జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా బీచ్‌లోని జీసస్ పార్కు నుంచి ఆదివారం సాయంత్రం నిరసన ర్యాలీ చేపట్టారు. భీమిలి యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్‌కి చెందిన కేఎస్ సుధాకర్ ఆధ్వర్యంలో ఆత్మ గౌరవ శాంతి ర్యాలీ నిర్వహించారు. భీమిలి పరిసర ప్రాంతాల దైవ సేవకులు, సంఘాల పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

పీఎం పాలెం: తాడిత పీడిత ప్రజల గుండె చప్పుడే పల్లవిగా ఆడి పాడిన విప్లవ కవి, గాయకుడు గద్దర్‌కు సాటి గద్దరే అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జన చైతన్య మండలి ఉపాధ్యక్షులు పరువు రాజేశ్వరరావు అన్నారు. ఎన్నో ఉద్యమాలకు తన గళాన్నే ఆయుధంగా ఎదురొడ్డిన ధీశాలి అని కొనియాడారు. ఆయన మృతి సందర్భంగా చిత్రపటానికి పీఎం పాలెంలో ఆదివారం రాత్రి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా జన చైతన్య మండలి అధ్యక్షుడు లండా కృష్ణారావు, కార్యదర్శి డప్పు ప్రసాద్, జీఎస్ రత్నం, కె.దమయంతి, జె.సత్య పాల్గొన్నారు.

పరారీలో ఉన్న నిందితుడికి అరెస్ట్ వారెంట్

పీఎం పాలెం: పోలీసుల నుంచి ఏడేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడికి న్యాయమూర్తి అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. పీఎం పాలెం సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ఎండాడ గ్రామానికి చెందిన మొదిలి లక్ష్మీనాగ జాహ్నవి ఆమె భర్త మొదిలి బాబు వరకట్న వేధింపులకు గురి చేస్తున్నాడని 2016లో పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా మొదిలి బాబు నగరంలోని గాజువాక సమీప జోగవానిపాలెంలో నివసించేవాడని తెలిసింది. ఈ క్రమంలో భీమునిపట్నం మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరు కావాల్సి ఉండగా తప్పించుకు తిరగడాన్ని సీరియస్‌గా తీసుకున్న న్యాయమూర్తి ప్రోక్లామేషన్ అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. బాబు గురించి ఆచూకీ తెలిసిన వారు 94407 96060కు తెలియజేయాలని సీఐ కోరారు.

రోడ్డు మధ్యలో గొయ్యితో ప్రమాదాలు



నేళ్తేరు వద్ద రోడ్డు మధ్యలో ఉన్న గొయ్యి

ఆనందపురం : ఆనందపురం – బాకురుపాలెం మార్గంలో నేళ్తేరు వద్ద రోడ్డు మధ్యలో ఉన్న గొయ్యి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనచోదకులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా అందులో పడి గాయాలపాలవుతున్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో అక్కడ లోతట్టుగా ఉన్న చోట కల్వర్టు నిర్మించి రోడ్డుని ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అక్కడ రోడ్డుని లోతట్టుగానే నిర్మించి వదిలేశారు. దీంతో పైనుంచి వచ్చే వరద నీరు ఎక్కువగా ప్రవహించడంతో పూర్తిగా కోరుకుపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. దాంట్లో నీరు చేరడంతో పెద్ద గుంతగా తయారైంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు గుంతలో దిగడంతో అదుపు తప్పి పడిపోతున్నాయి. ఈ మార్గంలో సుమారు పది గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

19న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో ఖాళీ అయిన పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక ఈ నెల 19న జరగనుంది. ఈ నెల 8న పంచాయతీ వారీగా నోటిఫికేషన్ జారీతోపాటు వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. అదే తేదీ నుంచి 10 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. 11న నామినేషన్ల స్క్రూటినీ, 12న తిరస్కరణ, 13న తిరస్కరణకు గురైన అభ్యర్థులచే అప్పీల్, 14న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. అదేరోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాలు ప్రదర్శిస్తారు. 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నిక నిర్వహించి మధ్యాహ్నం 2 నుంచి కౌంటింగ్ చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు.

ఎన్నికలు జరగనున్న స్థానాలివే...

భీమిలి మండలం లక్ష్మీపురం సర్పంచ్ లచ్చుబుగత రామారావు మరణంతో ఖాళీ అయిన స్థానానికి ఎన్నిక జరగనుంది. అలాగే అదే మండలంలో టి.నగరపాలెం 10వ వార్డు, ఆనందపురం మండలంలోని కణమాం పంచాయితీ 3వ వార్డు, వెల్లంకి 6, 12 వార్డులు, పాలవలస 1వ వార్డు, పద్మనాభం మండలంలోని రెడ్డిపల్లి 9వ వార్డు, చిన్నాపురం 2వ వార్డు, బాందేవుపురం 10వ వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కోరాడలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

తగరపువలస: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరస్వామి రచించిన వంద రకాల ఆధ్యాత్మిక గ్రంథాలను ఆదివారం ఆయన శిష్యులు ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. చిట్టివలస, భీమిలి, మధురవాడ ప్రాంతాల్లో సమితి సభ్యుడు రావణ అక్షయ్ మాట్లాడుతూ భగవద్గీత జ్ఞాన యోగం 7వ శ్లోకంలోని విషయాలను వివరించారు. ప్రపంచానికి భగవంతుడొక్కడే గురువన్నారు. మీనా, ఆదమ్మ, అప్పలనరసమ్మ, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని కోరాడ, లింగన్నపేట గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై విజయరాంపురం ఇందు జ్ఞాన కమిటీ సభ్యులు ప్రచారం చేశారు. మనుషుల హితం కోసం భగవద్గీత అందించిన శ్రీకృష్ణ భగవానుడే మనకు నిజమైన స్నేహితుడని ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు బి.పైడన్న, జి.సన్యాసి, సురేష్, కె.రాజు, టి.మంగమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

ఆత్మీయ మిత్రుల అపూర్వ కలయిక



40 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఆత్మీయ స్నేహితులు



సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాలకు రూ.2.50 లక్షలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలి సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాలలో 1983లో ఏడో తరగతి చదువుకున్న వారు... ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1986 - 88 వరకు చదివిన సైన్స్ గ్రూప్ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా పాఠశాల వద్ద కలుసుకున్నారు. ఈ అపూర్వ కలయికకు సంబంధించిన రూబీ జూబ్లీ వేడుకను ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి(ఫ్యాబ్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఎంతో భావోద్వేగానికి గురయ్యారు. ప్రతి ఒక్కరూ యోగ క్షేమాలు తెలుసుకుని... తాము చదువుకున్న రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కోసం రూ.2.50 లక్షలు అందజేశారు. పూర్వ విద్యార్థులంతా 40 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు అన్నారు. ఇక్కడి ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు.

పబ్లిక్ డిమాండ్

పారిశుధ్యం మెరుగుపరచాలి



తుప్పలతో నిండిపోయిన అంబేడ్కర్ పార్కు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలి. జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే రహదారి మురుగునీటితో ఉంది. ఇందులో నుంచే విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. రైతు భరోసా కేంద్రం వద్ద చెత్త పేరుకుపోయింది. దీంతో చుట్టుపక్కల నివసిస్తున్న వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే పంచాయతీ నిధులతో అభివృద్ధి చేసిన అంబేడ్కర్ పార్కు తుప్పలతో నిండిపోయింది. ఇందులో విష పురుగులు చేరడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మూడు నెలలుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యలు సచివాలయ సిబ్బంది, పంచాయతీ పాలకవర్గం పరిష్కరించాలి.

– పతివాడ రాంబాబు,
మాజీ ఉప సర్పంచ్, తాటితూరు.

చుండూరు హంతకులను శిక్షించాలి

సీతమ్మధార : చుండూరు హంతకులను శిక్షించాలని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దళిత విముక్తి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. 32 ఏళ్లయినా చుండూరు దళితుల హత్యాకాండలో బాధితులకు న్యాయం జరగలేదని వాపోయారు. ఈ సందర్భంగా దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, దళిత హక్కుల సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ 1991 ఆగస్టు 6న చుండూరులో దళితులపై మారణకాండకు పాల్పడి ఎనిమిది మందిని హతమార్చారని గుర్తు చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ 13 ఏళ్ల తర్వాత పాక్షిక న్యాయమే జరిగిందన్నారు. దేశంలో అనేక కేసులు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా పరిష్కరిస్తున్నారని, దళితుల కేసులో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. బంకపల్లి అప్పారావు, రామకృష్ణ, బి.సన్యాసిరావు, కె.కుమార్, వీఎస్ కృష్ణ, హుస్సేన్, రాంప్రభు, గురవయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం

సీతమ్మధార : ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకుందామని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సీఐటీయూ) నాయకుడు నమ్మి రమణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలు 857వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు అమ్మేయాలని చూడటం అవివేకమన్నారు. కార్పొరేటీకరణ విధానాలు అమలు చేసిన ఏ దేశం అభివద్ధి సాధించలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీను, వి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.